క్లుప్తంగా

వంతెనపై స్తంభించిన ట్రాఫిక్



సీతానగరం బస్టాప్ వద్ద స్తంభించిన ట్రాఫిక్, రోడ్డుపై మహిళా ప్రయాణికులు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై సీతానగరంలో ఉన్న సువర్ణముఖి నది వంతెనపై గురువారం వాహనాలు చిక్కు కోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. బొబ్బిలి నుంచి వచ్చే భారీవాహనం, పార్వతీపురం వైపు నుంచి విశాఖ వెళ్లే భారీవాహనాలు వంతెన మధ్యలో ఇరుక్కుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువ మంది మహిళాప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడాల్సి వచ్చింది. హెచ్‌సీ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు జోక్యం చేసుకుని వాహనాలను దారి మళ్లించడంతో సమస్య పరిష్కారమైంది.

జీఎస్టీపై అవగాహన



అంటివలసలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని అంటివలస గ్రామంలో గురువారం ఈవో శ్రీనివాస్ జీఎస్టీ, పీఎం జన్మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. అలాగే పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రజల వ్యక్తిగత అవసరాలతోపాటు, సామాజిక అవసరాలను గుర్తించారు. గ్రామంలో ప్రతిపాదిత పనుల కోసం కొలతలు వేశారు. అనంతరం స్థానిక సచివాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వద్ద జీఎస్టీపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆలయప్రధాన అర్చకుడు పి. శ్రీనివా సాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా ముడుపులపూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తుల దర్శనార్థం వివిధ రకాల పూలతో అలంకరించారు. ముడుపుల పూజలకు సుదూర ప్రాంతాలనుంచి భక్తులు పూజాసామగ్రితో వచ్చి పాల్గొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చి ముడుపుల పూజలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.


బాలికా దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలు



కాశీపట్నం కేజీబీవీలో ఆటలాడుతున్న విద్యార్థులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పి.రాజశ్రీ, బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలను నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు ఆటలపోటీల్లో పాల్గొన్నారు. ఈపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 11వతేదీ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని, బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సూపర్‌వైజర్‌లు రాజశ్రీ, విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి జి.నాగదుర్గ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు బిల్లు రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: పరిశ్రమలలో పనిగంటలు 8 నుంచి 12కు పెంచుతూ ప్రభుత్వం ఆమోదించిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ, రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాలు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసే ఈ బిల్లును కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా ఆమోదించడం అన్యాయమన్నారు. చారిత్రక 8గంటల పని హక్కును కాలరాయొద్దని, ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యమ్మల మన్మథరావు, ఎం. కృష్ణమూర్తి, కె.గంగునాయుడు, ఆర్. రమణమూర్తి పాల్గొన్నారు.

దళిత ద్రోహి ఎవరో అందరికీ తెలుసు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు



అంబేడ్కర్ విగ్రహాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, భాగ్యవతి, సుధాకర్ తదితరులు

- ఎమ్మెల్యే విజయచంద్రపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ధ్వజం

పార్వతీపురం రూరల్:

చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించిన నేపథ్యంలో గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర పార్వతీపుచం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దళిత ద్రోహి అంటూ వ్యాఖ్యలు చేయడం పట్ల వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ విభాగం, ఎస్సీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే అధికారంలోకి రాగానే దళితులపై ఉక్కుపాదం మోపుతూ వారి జీవనోపాధిని దెబ్బతీసిన ఎమ్మెల్యే విజయచంద్రకు విమర్శించే నైతిక హక్కు కూడా లేదని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సరివిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణమే పార్వతీపురంలో విధ్వంసం సృష్టిస్తూ ఓ దళిత విలేకరి ఇంటిని కూల్చిన చరిత్రను విజయచంద్రదని అలాగే పట్టణంలో తోపుడు బళ్లు పెట్టుకుని జీవిస్తున్న వందలాది దళిత కుటుంబాల పొట్టకొట్టి వారి జీవనాధారాన్ని నిర్ధాక్షిణ్యంగా కాలరాసింది మీరు కాదా? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. చిరువ్యాపారాలు చేసుకునే దళితులపై ఉక్కుపాదం మోపిన ఎమ్మెల్యే ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని దళితుల పక్షపాతిగా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

ఆత్మ గౌరవాన్ని నిలిపిన నేత జగన్

2014లో రాజధానిలో అంబేడ్కర్ విగ్రహం కడతామని మాట ఇచ్చి దళితులను అనేక విధాలుగా నట్టేట ముంచి మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది అయితే అదే దళితులకు ఇచ్చిన మాట ప్రకారం విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అత్యంత ప్రతిష్టాత్మకమైన అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పి, దళిత, బడుగు, బలహీన వర్గాల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడితోపాటు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కె. సుధాకర్, కౌన్సిలర్ సుధీర్, నేతాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాగ్యవతి, ఆర్టీఐ కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి కె. ప్రకాష్, సీనియర్ నాయకులు లక్ష్మి, ప్రభావతి, చింతగడ లక్ష్మి, ఎస్. గోపి, పోల క్రాంతి, రాజేష్, ఎస్. నారాయణరావు, పట్టణ దళిత నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో అర్జునరావు

మక్కువ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీవో ఎం.అర్జునరావు కోరారు. ఈ మేరకు మండలంలోని కాశీపట్నం కేజీబీవీని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. సిలబస్ ఏమేరకు పూర్తి అయిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మధ్యాహ్నభోజన వంటకాలను పరిశీలించారు. మెను ప్రకారంగా భోజనం అందుతోందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మౌలికసదుపాయాలపై ఆరా తీశారు. పాఠశాలలో ఏసమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకధికారిణి జి.నాగదుర్గ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలకు 'తల్లీబిడ్డ' సర్వీసులు దూరం

ఆటోలోనే బిడ్డతో గ్రామానికి వెళ్లిన బాలింత



ఆటోలో పాపతో గ్రామానికి చేరుకున్న బాలింత కుమారి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన బాలింతకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ లేదని తెలపడంతో ఆటోలోనే తమ గ్రామానికి బిడ్డతో వెళ్లింది. పాచిపెంట మండలంలోని శతాబి గ్రామానికి చెందిన శిల్పాజన్ని కుమారి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్న నేపథ్యంలో గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ ఇచ్చారు.అయితే రోడ్డుబాగానే ఉన్నప్పటికీ బాలింత స్వగ్రామమైన శతాబికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను పంపించలేదు. దీంతో ఆమె చేసేది లేక చేతబిడ్డతో ఓ ఆటోలో తమ గ్రామానికి చేరుకుంది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు ఏ విధమైన సదుపాయాలు అందుతున్నాయో తెలపడానికి ఇది ఓ నిదర్శనమంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన మహిళలను ప్రసవం అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ద్వారా క్షేమంగా ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు కోరారు.

సచివాలయం ముట్టడి



సచివాలయం ముట్టడికి కేరంగి సచివాలయ సమీపంలో గుముగూడిన గిరిజన రైతులు

పాచిపెంట: మండలంలోని తుమరావల్లి పంచాయతీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు అన్నదాత సుఖీభవ నిధులు రాలేదని పంచాయతీకి చెందిన గిరిజన రైతులు గురువారం కేరంగి సచివాలయాన్ని ముట్టడించారు. అనంతరం సచివాయలంలో గ్రీవెన్స్ స్వీకరిస్తున్న ఎంపీడీఓ బీవీజే పాత్రోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా డబ్బులు పడ్డాయని, ఇప్పటి ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ డబ్బులు తమకు రాలేదన్నారు. అధికారులు స్పందించి అన్నదాత సుఖీభవ నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మి సింహాచలం, కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య, ఎంపీటీసీ డి. లచ్చయ్య, గిరిజన రైతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్‌ఓ ప్లాంట్



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్

పాచిపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓప్లాంట్ మరమ్మతుల బారిన పడి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దాన్ని బాగుచేసే ప్రయత్నం కూడా చేయకపోవడంతో పాఠశాల ఆవరణలో ఉన్న చేతిపంపు నీటినే విద్యార్థులు తాగుతున్నారు. అధికారులు స్పందించి ఆర్‌ఓ ప్లాంట్‌ను బాగు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతం దళాయివలసలో పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

సాలూరు రూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా గురువారం డీఆర్‌డీఏ పీడీ సుధారాణి దళాయివలస, దిగువమెండంగి వాటర్ ఫాల్స్‌ను పరిశీలించారు. ముందుగా దళాయివలస వాటర్ ఫాల్స్‌కు వెళ్లడానికి జంగిల్ క్లియరెన్స్ చేయాలని స్థానిక గిరిజనులకు చెప్పారు. పర్యాటకులకు అవసరమైన మంచినీరు. స్నాక్స్, కూర్చోడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులకు చెప్పారు. అలాగే మహిళా సంఘాల సభ్యులు ఎవరైనా షాపులు పెడితే వారికి బ్యాంక్ లోన్లు ఇచ్చి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అంపల్లి జయమ్మ, సీసీలు లక్ష్మణరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

- పరిహారం ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలి
- 13 నుంచి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక సభ్యులు

పార్వతీపురం టౌన్:

ఇటీవల మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులతో సహా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ చనిపోయిన గిరిజన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని గిరిజన, విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలోని ఏపీఎన్జీవో భవనంలో గిరిజన విద్యార్థుల మరణాల పై 'రౌండ్ టేబుల్' సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాలు, గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, ఏపీ రైతు సంఘం, కాంగ్రెస్, సీపీఐ లిబరేషన్, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం ఐలూ, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల మరణాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల తీరు నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

బాధితులకు న్యాయం చేయాలని కోరిన గిరిజన సంఘాల నాయకులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చెప్పినట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. రెగ్యులర్‌గా మెడికల్ చెకప్‌లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 13 నుంచి కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, కె మల్లేష్, పీడీఎస్ఓ నాయకులు కె.సోమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.రవి కుమార్,కె.ప్రదీప్, ఆర్.వికాస్, ఎ.చరణ్, ఎం.బుజ్జి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కె.రామాస్వామి, సీపీఐ లిబరేషన్ నాయకుడు పి.సంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, ఏపీ రైతు సంఘం నాయకుడు ఈవీ నాయుడు, న్యాయవాది, ఐలూ సంఘం నాయకుడు ఎంవీ రమణ, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు ఎ.చందు, డి.స్వాతి, ఆర్.రజని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న నేత్ర వైద్యులు

పార్వతీపురం టౌన్: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య విభాగంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి గురువారం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు నిర్వహించి కేటరాక్ట్, టెరిజియం, గ్లకోమా వంటి దృష్టిదోషం ఉన్నవారిని గుర్తించి మెరుగైన శస్త్ర చికిత్సల కోసం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు తెలిపారు. వారందరికీ ఉచిత రవాణా, భోజనం, మందులు, కళ్లజోళ్ల సౌకర్యం కల్పించి వారికి దృష్టి దోష నివారణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలో లభించే నేత్ర వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో డా.వెంకటేష్, నేత్ర వైద్య నిపుణుడు డా.వెంకటేష్, నేత్ర వైద్యాధికారి కృష్ణారావు, నేత్ర వైద్య సహాయకులు స్వాతి, నర్సింగ్ శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

గోశాలల లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులు



మాట్లాడుతున్న గోశాలల లబ్ధిదారులు శంకర్రావు, గోదారినాయుడు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల పశుసంరక్షణనిమిత్తం ఏడాది క్రితం మంజూరుచేసిన గోశాలల లబ్ధిదారులకు ఇంతవరకూ బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ ఆఫీసు ఎదుట లక్ష్మీపురం గ్రామానికి చెందిన గోశాలల లబ్ధిదారులు గవర శంకరరావు(6 పశువులు), దొడ్డి గోదారినాయుడు(4 పశువులు) మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబానికి చెంది, ఆర్థికంగా వెనుకబడి ఉన్నా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్న నమ్మకంతో ప్రైవేట్‌గా అప్పులుచేసి అధికారులు నిర్దేశించిన సమయానికి గోశాలల నిర్మాణం చేశామన్నారు. ఎంతవేగంగా నిర్మానం పూర్తి చేస్తే అంతేవేగంగా బిల్లులు బ్యాంక్ అకౌంట్లలో జమచేస్తామని ఇచ్చిన హామీమేరకు నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసి ఏడాది కావస్తున్నా ఇంతవరకూ బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గోశాలల బిల్లులు చెల్లించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైద్యవిద్య ప్రైవేట్ పరం వద్దు

- ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నడపాలి
- వామపక్ష, ప్రజాసంఘాల డిమాండ్



డీఆర్‌ఓ కె.హేమలతకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న వాటిని పూర్తిచేసి నిర్వహించాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విధానం పేదలకు వైద్యాన్ని, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధాన నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ డీఆర్‌ఓ కె.హేమలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పార్టీ నాయకులు వి.ఇందిర, ఆర్.వేణు, లిబరేషన్ నాయకులు సంఘం, సీపీఐ నాయకుడు డీవీ నాయుడు, సీఐటీయూ నాయకుడు మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రెడ్డి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో ఘనంగా నందెన్న ఉత్సవాలు



రామవరం నందెన్న నిర్వాహకుల నివాసంలో కొలువైన పూజలందుకుంటున్న గౌరీదేవి, పార్వతీపరమేశ్వరులు

సీతానగరం: హిందువుల ఆచారం మేరకు మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న గౌరీపౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం రామవరంలో నిర్వాహకుల ఆధ్వర్యం లో బిందెల్లో నువ్వులనూనెతో అఖండజ్యోతులు వెలిగించి భక్తి భావాన్ని చాటుకున్నారు. హిందూ సంప్రదాయానికి అనుగుణంగా నందెన్నపై అధిష్టించిన గౌరీదేవి,పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తుల మంటపంపై వివిధ రకాలు చీరలు, ఫలాలతో వెదురు కలపతో తయారుచేసిన పాలవెల్లిని ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు. రాత్రింబవళ్లు స్వామివారికి అనుపోత్సవం వరకూ మహిళా భక్తుల పహారా ఉంటుందని నిర్వాహకులు తెలియ జేశారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శ



చికిత్సపొందుతున్న విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ

పార్వతీపురం: కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పచ్చకామెర్లతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 120 మంది ఆరోగ్య పరిస్థితిపై ఏఐటీయూసీ ఏపీ శ్రామిక మహిళ ఉమ్మడి జిల్లా కన్వీనర్, స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ గురువారం జిల్లా ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించి, ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కలుషితమైన తాగునీరు, పారిశుద్ధ్య లోపం కారణంగానే ఒక్కసారి ఇంతమంది పచ్చకామెర్లు బారిన పడినట్లు వైద్యులు పేర్కొంటు న్నారన్నారు. గురుకుల పాఠశాలలో వసతులపై క్షేత్రస్థాయలో పరిశీలించి అధికారులతో చర్చిస్తామన్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఒక్కసారిగా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అంతకుముందు గిరిజన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై కనీసం పట్టించుకోకపోవడంవల్ల ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమయ్యా రన్నారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియోను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న 87 విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఆమెతో పాటు ఏఐటీయూసీ నాయకులు రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పన్ను చెల్లింపులపై అవగాహన

సీతానగరం: భూములున్న రైతులు నీటి తీరువా పన్నులు ప్రభుత్వానికి చెల్లించడానికి సిద్ధం కావాలని, పన్నుల చెల్లింపు విషయమై రైతులు అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కాశీపేట సచివాలయంలో వ్యవసాయ భూములకు నీరు వినియోగిస్తున్న రైతులు నీటి వినియోగపు పన్ను చెల్లించాలని కోరారు. జిరాయితీ భూములున్న రైతులు భూములభివృద్ధికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేయడానికి పన్నుల ద్వారా వసూలయ్యే నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు, అలాగే గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులకు వస్తున్న రెవెన్యూ అధికార సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. రోజుకు రెండుగ్రామాల వంతున రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నామన్నారు. గురువారం పణుకుపేట, కాశీపేటలో రైతులతో గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు.

12న వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

పార్వతీపురం రూరల్: ఈనెల 12 ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ నాయకులతో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేర్కొన్నారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో సమావేశం జరుగుతుందని, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు, ముఖ్య నాయకులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే ఒక ప్రకటనలో కోరారు.